RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 112 | మే 18 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 112 | May 18 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


పంట వ్యర్థాలను కాల్చడంతో ప్రతికూల ప్రభావం 2

# ఐదు రోజులు నిప్పులే..

## వాతావరణ శాఖ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తెలంగాణ మొదలుకొని దేశ రాజధాని ఢిల్లీ వరకు సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రాబోయే వారం రోజుల పాటు ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మే నెల చివరికి వస్తున్నా.. భానుడి భగభగలు ఏమాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా రాబోయే ఐదు రోజులు అత్యంత తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తెలంగాణలో కూడా ఎండల తీవ్రత విలవిలలాడిస్తోంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పల్లెలు, పట్టణాల రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాలకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేయగా, మరో 16 జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో వడగాలుల ప్రభావంతో పాటు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఒక ప్రాంతంలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ నమోదైతే దానిని 'హీట్ వేవ్'గా పరిగణిస్తారు. కూలీలు, వ్యవసాయదారులు ఉదయం పూట పనులు ముగించుకుని ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఓవైపు ఎండలు భగ్గుమంటున్నా.. మరో వైపు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. సంగారెడ్డి,



వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే జిలాల్లకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్,

➢ మిగతా 2వ పేజిలో..

# సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం**



**న్యూ ఢిల్లీ జనసంఘర్షణ**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. దీంతో సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, సత్వర న్యాయం అందించేందుకు వీలవుతున్నారు. కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన ప్రతిపాదనకు అనుగుణంగా, రాష్ట్రపతి 'సుప్రీంకోర్టు సవరణ ఆర్డినెన్స్, 2026'ను జారీ చేశారు. దీంతో ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 34 నుంచి 38కి పెరుగనుంది. 2019 తర్వాత సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్యను పెంచడం ఇదే మొదటిసారి.

➢ మిగతా 2వ పేజిలో..

# గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ



**వాషింగ్‌టన్ జనసంఘర్షణ**

ప్రాణాంతక వైరస్ ఎబోలా వ్యాప్తి దృష్ట్యా ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. కాంగో , ఉగాండా దేశాల్లో 300 ఎబోలా కేసులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ప్రకటన విడుదల చేసింది. ఈ ఎబోలా వైరస్‌తో 88 మంది మరణించినట్లు తెలిపింది. దీనివల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినప్పటికీ కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటిస్తున్నట్లు వెల్లడించింది. ఇతర దేశాల్లో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. 1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా గుర్తించినప్పటి నుంచి ఇది 17వ సారి వ్యాప్తి చెందడమని అక్కడి స్థానిక అధికారులు తెలిపారు.

➢ మిగతా 2వ పేజిలో..

# ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

## సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే ఆక్వా రంగాన్ని ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అమెరికా (ఖూ) ప్రభుత్వం ఏపీ ఆక్వా ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం అదనపు సుంకాన్ని (టారిఫ్) విధించడంతో ఇక్కడి ఎగుమతులు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు రాసిన లేఖలో సీఎం చంద్రబాబు ఆక్వా రైతులు, ఎగుమతిదారుల కష్టాలను వివరించారు. అమెరికా తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం వల్ల రాష్ట్రంలోని ఆక్వా రంగానికి వాటిల్లుతున్న నష్టాన్ని పూడ్చేందుకు కేంద్రం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు 30 లక్షల మంది ఉపాధికి ముప్పు! ఆంధ్రప్రదేశ్ నుండి అమెరికాకు భారీ ఎత్తున రొయ్యలు, ఇతర ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. అయితే, తాజా సుంకాల పెంపుతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఏపీ ఆక్వా ఉత్పత్తుల ధరలు పెరిగి, డిమాండ్ దారుణంగా పడిపోయింది. దీనివల్ల రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న 30 లక్షల మందికి పైగా కార్మికులు, రైతులు ఉపాధి



కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా పరిశ్రమ కుప్పకూలిపోకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి అమెరికా ప్రభుత్వంతో ఉన్నత స్థాయి దౌత్యపరమైన చర్చలు జరపాలని, ఈ అదనపు సుంకాలను తగ్గించేలా ఒత్తిడి తీసుకురావాలని సీఎం చంద్రబాబు లేఖలో గట్టిగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఆక్వా రంగానికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అమలు చేయాలని సీఎం డిమాండ్ చేశారు.

➢ మిగతా 2వ పేజిలో..

# ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలొడ్డి పోరాడిన ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, సాయం అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. తాజాగా సీనియర్ నేత కే కేశవరావు చైర్మన్‌గా ఏర్పాటైన 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' తొలిసారిగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యమకారులను ఎలా గుర్తించాలి? వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వాలి? అన్న దానిపై ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ కేశవరావుతో పాటు మంత్రి పొన్నం



ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్,

➢ మిగతా 2వ పేజిలో..

# ఎలక్ట్రిక్ బస్సులపై క్లారిటీ

**అమరావతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంపై గత కొద్దిరోజులుగా జరుగుతున్న ప్రచారానికి యాజమాన్యం తెరదించింది. ఆర్టీసీలోకి విద్యుత్ బస్సులు రావడం వల్ల సంస్థ ప్రైవేటుపరం అవుతుందని, తద్వారా ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే అపోహలపై ఎపిఎస్‌ఆర్‌టిసి స్పష్టమైన వివరణ ఇచ్చింది. ఈ సరికొత్త పర్యావరణహిత బస్సుల కొనుగోలు మరియు నిర్వహణ ప్రక్రియ కేవలం ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికేనని,

➢ మిగతా 2వ పేజిలో..

# ఐదు రోజులు నిప్పులే..

నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.
న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం లెక్కల ప్రకారం, ఢిల్లీలో రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర క్రమంగా పెరిగే అవకాశం ఉంది. రాత్రి పూట నమోదయ్యే కనీస ఉష్ణోగ్రతలు కూడా ఇదే స్థాయిలో 2-3 డిగ్రీలు పెరగనున్నాయి. ముఖ్యంగా మే 18న ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదు కానున్నాయి. మే 19, 20 తేదీల్లో ఉష్ణోగ్రతలు 43-45 డిగ్రీలు గానే ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.
రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్ ప్రాంతాల్లో మే 22 వరకు ఈ వడగాలుల ప్రభావం తీవ్రంగా ఉండనుంది. అయితే నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు (అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్), అలాగే కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లాంటి దక్షిణ రాష్ట్రాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటం కాస్త ఊరటనిచ్చే అంశం.
మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే.. ఈ జాగ్రత్తలు మస్ట్
ఈ ఎండల తీవ్రత వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారి ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. కాబట్టి ఈ కింది జాగ్రత్తలు తప్పక పాటించండి.
మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు వీలైనంత వరకు ఇంటి లోపలే లేదా నీడలోనే ఉండండి.
దాహం వేయకపోయినా తరచుగా తగినంత నీళ్లు తాగుతూ ఉండండి.
బయటకు వెళ్లేటప్పుడు తేలికపాటి, లేత రంగు కాటన్ బట్టలు ధరించండి.
తలకు టోపీ లేదా గొడుగు తప్పనిసరిగా వాడండి.
వడదెబ్బ తగలకుండా తల, ముఖం కవర్ అయ్యేలా క్లాత్ కట్టుకోండి.

# సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు

కాగా, దేశ అత్యున్నత న్యాయస్థానంలో రెండు న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత సీజేఐ సూర్యకాంత్ కంటే ముందు ఆ పదవిలో ఉన్న జస్టిస్ బీఆర్ గవాయ్ గతేడాది నవంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జస్టిస్ రాజేశ్ బిందాల్ రిటైర్ అయ్యారు. 2026 చివరి నాటికి మరో ముగ్గురు జడ్జిలు పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పంకజ్ మిట్టల్ వచ్చే నెలలో, జస్టిస్ సంజయ్ కరోల్ ఆగస్టులో రిటైర్ కానున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు 92,000 కంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జడ్జిల సంఖ్య పెంపునకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో, ఈ ఆర్డినెన్స్‌ను రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు రూపంలో ప్రవేశపెట్టి, ఉభయ సభల ఆమోదంతో పూర్తిస్థాయి చట్టంగా మార్చనున్నారు.

# గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ

ప్రాథమిక నమూనాలలో అధిక పాజిటివిటీ రేటు, వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకరంగా మారిందని వెల్లడించింది.
భయంతో సరిహద్దులు మూయొద్దు.. ఎబోలా వైరస్‌కు ప్రత్యేకంగా ఆమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేవని, దీన్ని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. జాతీయ విపత్తు అత్యవసర నిర్వహణ యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని సూచించింది. సరిహద్దుల వెంబడి స్క్రీనింగ్ చేపట్టాలని ప్రపంచ దేశాలను హెచ్చరించింది. వైరస్ భయంతో సరిహద్దులను మూసివేయవద్దని కోరింది. ప్రయాణ, వాణిజ్య ఆంక్షలు విధించవద్దని.. వైరస్ లక్షణాలు ఉన్నవారు ఇతర దేశాలకు వెళ్లొద్దని పేర్కొంది. వ్యాధి నిర్ధారణ అయిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి వారితో సంబంధం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని కాంగో ప్రభుత్వానికి సూచనలు చేసింది.

## ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

మొదటిపేజీ తరువాయి.. అందులో భాగంగా ప్రధానంగా ఈ క్రింది ప్రతిపాదనలను కేంద్రం ముందుంచారు: వర్కింగ్ క్యాపిటల్ పెంపు: ఆక్వా పరిశ్రమల నిర్వహణ మూలధన (ఔతీసెఱఅస్త ఋఇజూఱ్‌ఱ్శ్రీ) పరిమితులను తక్షణమే 30 శాతానికి పెంచాలి. వడ్డీ మారటోరియం: ఎగుమతిదారులు చెల్లించాల్సిన బ్యాంక్ వడ్డీలపై కనీసం 240 రోజుల పాటు మారటోరియం విధించాలి. రాయితీలు ఢ జీఎస్టీ మినహాయింపు: వడ్డీ రేట్లను 5 శాతానికి పరిమితం చేయడంతో పాటు, ఆక్వా ఉత్పత్తులపై ఉన్న 5 శాతం జీఎస్టీ నుండి తాత్కాలికంగా మినహాయింపు ఇవ్వాలి. ఈ చర్యలు తీసుకుంటేనే ప్రస్తుత సంక్షోభం నుండి ఆక్వా రంగం గట్టెక్కగలదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ

మొదటిపేజీ తరువాయి.. మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. కమిటీని అధికారికంగా ఏర్పాటు చేసినందుకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమిటీ కార్యకలాపాలు సాఫీగా సాగేందుకు వీలుగా, హైదరాబాద్‌లోని 'అమరవీరుల జ్యోతి' కింద ఉన్న ఆఫీస్‌లో కమిటీకి ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గుర్తింపు కోసం 4 కేటగిరీల ప్రతిపాదన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు కమిటీ ప్రధానంగా నాలుగు కేటగిరీలను ప్రతిపాదించింది.
మొదటి కేటగిరి: తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వనున్నారు. రెండో కేటగిరి: ఉద్యమ సమయంలో లాఠీచార్జిలు, ఇతర ఘటనల్లో తీవ్రంగా గాయపడిన వారిని ఈ కేటగిరిలో చేరుస్తారు.
మూడో కేటగిరి: జైలు జీవితం గడిపిన వారు, అరెస్ట్ అయిన వారు, పోలీసు కేసులను ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరిలో పరిగణిస్తారు.
నాలుగో కేటగిరి: రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉండి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారు. పేపర్ కటింగ్స్, ఇతర ఆధారాలను బట్టి వీరికి గుర్తింపు ఇస్తారు.
అభిప్రాయ సేకరణ.. ఆల్ పార్టీ మీటింగ్
ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో ఎవరికీ అన్యాయం జరగకుండా ఉండేందుకు త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. వివిధ జేఏసీలు (జేఏసీ), 1969, 1972, 1996 నాటి పాతతరం ఉద్యమకారులు, ఉద్యోగ, కళాకారుల సంఘాలు, కుల సంఘాలు, న్యాయవాదుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని డిసైడ్ అయ్యారు. పౌరసమాజం అభిప్రాయాలు తెలుసుకునేందుకు కమిటీ సభ్యులు జిల్లాల్లో పర్యటించనున్నారు. రాజకీయాలకు అతీతంగా
గత ప్రభుత్వంలో కేవలం కొంతమందికి మాత్రమే సహాయం అందిందని కమిటీ అభిప్రాయపడింది. ఇప్పుడు అలాంటి పక్షపాత ధోరణి లేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తీర్మానించింది. సీఎం రేవంత్ రెడ్డి కేరళ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి రాగానే, ఈ ప్రతిపాదనలపై ఆయనతో చర్చించి ఫైనల్ డెసిషన్ తీసుకోనున్నట్లు కమిటీ స్పష్టం చేసింది.

# ఎలక్ట్రిక్ బస్సులపై క్లారిటీ

మొదటిపేజీ తరువాయి.. దీనివల్ల సంస్థ ప్రైవేటీకరణ కాదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, ఆర్టీసీ కార్మికులు మరియు ఉద్యోగుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లబోదని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం ఈ-బస్ సేవా' పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైనట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ఈ పథకం ద్వారా మొదటి దశలో దాదాపు 750 ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్రంలోని ప్రధాన నగరాల పరిధిలోకి రానున్నాయి. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ లేదా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో ఈ బస్సులు నడవనున్నాయి. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో టెండర్లు దక్కించుకున్న ప్రైవేట్ సంస్థలు ఈ బస్సులను సరఫరా చేయనున్నాయి. దీనివల్ల ఆర్టీసీపై ముందస్తు పెట్టుబడి భారం పడకుండా, అధునాతన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని మేకర్స్ వివరించారు.
పర్యావరణ పరిరక్షణే ధ్యేయం.. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ కట్టుబడి!
రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు డీజిల్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవడానికి ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం ఎంతో దోహదపడుతుందని ఆర్టీసీ పేర్కొంది. సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు పర్యావరణహితమైన ప్రజా రవాణా వ్యవస్థను అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ నిరంతరం కట్టుబడి ఉంటుందని అధికారులు పునరుద్ఘాటించారు. ఈ ఈ-బస్సుల కొరకు రాష్ట్రంలోని ఎంపిక చేసిన 11 ప్రధాన నగరాలు మరియు వివిధ డిపోలలో అత్యాధునిక ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఛార్జింగ్ పాయింట్లు) పనులను కూడా శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు, ప్రయాణికులకు త్వరలోనే ఒక సరికొత్త ప్రయాణ అనుభూతి లభిస్తుందని యాజమాన్యం వెల్లడించింది.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

### 18నుండి 23వరకు క్రీడా పర్యాటక వారోత్సవాలు

### జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలికాన్ఫరెన్స్

**హైదరాబాద్, మే16 :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలిసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్- తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5 కె రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించారు.

# పొదుపు చర్యల్లో భాగమే మహానాడు మార్పు

### ప్రధాని పిలుపుతో సీఎం చంద్రబాబు నిర్ణయం

### మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**మచిలీపట్నం, మే16 :** పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్ల వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియచేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు.
నిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించి నట్లు చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయిస్తే సహించమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చడంతో ప్రతికూల ప్రభావం

### రైతులకు అవగాహన కల్పించాలి

### వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి

**హైదరాబాద్, మే16 :** వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల భూసారం, పర్యావరణం మరియు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి తెలిపారు. తాత్కాలిక సౌలభ్యం కోసం పంట వ్యర్థాలను తగులబెట్టడం రైతులకు దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలను కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంచాలకులు ఆదేశించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో పాటు రైతులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాల్లో పంట అవశేషాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అలాగే, పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చకుండా రోటవేటర్లతో కలియదున్నడం, వేస్ట్ డీకంపోజర్ వినియోగం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని రైతులను కోరారు.ల÷తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని డా. బి. గోపి ఆకాంక్షించారు.

## టిజి వెంకటేశ్ జన్మదిన వేడుకలు

### 60 జంటలకు సామూహిక వివాహాలు

**కర్నూలు, మే16 :** మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన పుట్టిన రోజు సందర్భంగా కర్నూలులో 60 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి నగదు చెక్కులు పంపిణీ చేశారు. సామూహిక వివాహ కార్యక్రమం అనంతరం మాజీ ఎంపీ వెంకటేశ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'సిద్ధార్థ్ రెడ్డిని ఒకసారి కలిసి భవిష్యత్తు బాగుంటుందని నేను చెప్పాను. రాయలసీమలో మీసాలు తిప్పిన పెద్దపెద్ద వాళ్లు చివరికి వాటిని దించి మా దగ్గరికి వచ్చారు. మీసాలు తిప్పే వారికి బుద్ధి చెప్పక తప్పదు. మీరు 100 మందిని తెస్తే మేము 1000 మంది తెస్తాం. సేవా కార్యక్రమాలకు కోట్లు ఖర్చు చేస్తున్నాం, మా కోసం ఖర్చు పెట్టలేమా?. మీరు రెచ్చిపోతే మా కార్యకర్తలు సరైన రీతిలో బుద్ధి చెబుతారు. మీరు అదుపులో ఉండాలని హెచ్చరిస్తున్నాం. మాకు నీతులు చెప్పే నాయకులు కర్నూలులో ఎన్నో భూములు కబ్జా చేశారు. ఆ భూములను మేము రక్షించాం.

# లక్ష్యాలు ఘనం.. పనులు శూన్యం: ప్రజాధనంపై పట్టింపేది?

❑ **ఆదేశాలకే పరిమితమైన అభివృద్ధి: ఇల్లందు 'మల్టీ యుటిలిటీ' కేంద్రం ఎప్పుడు తెరుచుకునేను?**





ఇల్లందు మే 17 (జన సంఘర్షణ)
ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించే నిధులు క్షేత్రస్థాయిలో సకాలంలో రూపం దాల్చనప్పుడు ఆ ప్రాజెక్టుల ఆశయం నీరుగారిపోతుంది. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "మల్టీ యుటిలిటీ" (ఫంక్షనల్) సెంటర్ ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఇదే అపనమ్మకం కలుగుతోంది. ఎంతో కాలంగా పనులు మధ్యలోనే నిలిచిపోయి, కేవలం ఒక కాంక్రీట్ కట్టడంగా దర్శనమిస్తున్న ఈ కేంద్రం, మన నియోజకవర్గంలో ప్రభుత్వ పనుల నెమ్మదితనానికి, అధికారుల పర్యవేక్షణా లోపానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పనుల్లో జాప్యంపై ఎట్టకేలకు స్థానిక రాజకీయ యంత్రాంగం కదిలింది. నిన్న ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఈ నిర్మాణ స్థలాన్ని స్వయంగా సందర్శించి, పెండింగ్ పనులను తక్షణమే ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్‌ను గట్టిగా ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవతో ఈ ప్రాజెక్టుకు తిరిగి జీవం వస్తుందని స్థానికులు ఆశలు పెంచుకుంటున్న తరుణంలో, నేడు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కూడా రంగంలోకి దిగి క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాంట్రాక్టర్ వీరన్నతో ,అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే కనకయ్య ప్రత్యేక సహకారంతో ఈ భవన నిర్మాణానికి రూ.64 లక్షల భారీ నిధులను మంజూరు చేయించామని గుర్తుచేశారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పుడు ఇక ఆలస్యం చేయడానికి ఎలాంటి సాకులు లేవని, కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆమె స్పష్టం చేయడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఈ పర్యటనలో ఒక చేదు నిజం వెలుగుచూసింది. ఈ ఫంక్షన్ హాల్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమి కొంత ఆక్రమణకు గురైనట్లు కాంట్రాక్టర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఇలా ఆక్రమణల పాలువుతుంటే మున్సిపల్ యంత్రాంగం ఇప్పటివరకు ఎందుకు మౌనంగా ఉందనేది ఇక్కడ మింగుడుపడని ప్రశ్న. ఈ ఆక్రమణలను వెంటనే తొలగించి, పనులు నిరాటంకంగా సాగేలా చూడాలని చైర్‌పర్సన్ ఆదేశించడం సరైన చర్యే అయినా, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాయకులు మారినప్పుడల్లా పర్యటనలు చేయడం, ఆదేశాలు జారీ చేయడం ఒక ఆనవాయితీగా మారింది. కానీ, రూ.64 లక్షల ప్రజాధనం సద్వినియోగం కావాలన్నా, ఈ మల్టీ యుటిలిటీ సెంటర్ స్థానిక పేద, మధ్యతరగతి ప్రజల శుభకార్యాలకు నిజంగా ఉపయోగపడాలన్నా.. ఈ ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ ఎండి జాఫర్, కోఆప్షన్ సభ్యురాలు పర్రె స్వర్ణలత, కాంగ్రెస్ నాయకులు గుండంపల్లి సతీష్ నాయుడు వంటి ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఈ కేంద్రాన్ని యుద్ధప్రాతిపదికన ప్రజలకు అంకితం చేసినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

# అక్షర యోధుడు వీరభద్రరావు ఇక లేరు

❑ **విద్యా రంగానికి తీరని లోటు**



భద్రాచలం మే 17 (జన సంఘర్షణ)
సమాజానికి దిశానిర్దేశం చేసే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా బతికిన ఒక అక్షర శిల్పి, సీనియర్ యుటిఎఫ్ నాయకుడు, ఆల్ పెన్షనర్స్ సభ్యుడు జె. వీరభద్రరావు (రిటైర్డ్ ఉపాధ్యాయులు) అనారోగ్యంతో కన్నుమూయడం విద్యా రంగానికి, కార్మిక ఉద్యమాలకు తీరని లోటు. భద్రాచలం రంగనాయకుల గుట్టపై ఉన్న ఎస్ఆర్ఎస్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తూ ఆయన నాడు నాటిన జ్ఞానబీజాలు, నేడు ఎందరినో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా, వివిధ ఉన్నత ప్రభుత్వ శ్రేణులుగా తీర్చిదిద్ది సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేశాయి. ఒకవైపు ఉపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే, మరోవైపు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకుడిగా ఉపాధ్యాయుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు వర్తమాన తరానికి స్ఫూర్తిదాయకం. కేవలం పదవీ విరమణతోనే తన బాధ్యత ముగిసిపోలేదని భావించి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్‌లో చురుగ్గా ఉంటూ చివరి శ్వాస వరకు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన వీరభద్రరావు భౌతికకాయానికి అసోసియేషన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎల్వీ ప్రసాద్, కోశాధికారి డి. కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో పెన్షనర్స్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇలాంటి నిబద్ధత కలిగిన గురువులను కోల్పోవడం అంటే ఒక తరం జ్ఞాన కోశాన్ని కోల్పోవడమే; ఆయన అందించిన అక్షర వెలుగులను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

# ఇల్లందు: ఈ నెల 20న మెడికల్ షాపుల బంద్

❑ **కార్పొరేట్ 'ఆన్‌లైన్' మాయాజాలం: చిన్న వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకమేనా?**

ఇల్లందు మే 17 (జన సంఘర్షణ)
డిజిటలైజేషన్ పేరుతో దేశంలోకి దూసుకొస్తున్న కార్పొరేట్ శక్తులు సాంప్రదాయ మార్కెట్ వ్యవస్థను ఎలా కుప్పకూలుస్తున్నాయో చెప్పడానికి తాజా 'ఆన్‌లైన్ ఫార్మసీ'ల ఉద్ధృతి ఒక ఉదాహరణ. ప్రాణాలను కాపాడే మందుల వ్యాపారం కూడా ఇప్పుడు పూర్తిగా వ్యాపారీకరణ వైపు అడుగులు వేస్తోంది. ఆన్‌లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని, పాత నిబంధనలను (జీఎస్ఆర్ 817) సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఇల్లందు పట్టణంలో మెడికల్ షాపుల బంద్ నిర్వహించాలన్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నిర్ణయం.. కేవలం ఒక నిరసన మాత్రమే కాదు, వారి ఉనికి కోసం చేస్తున్న ఒక పోరాటం. స్థానిక మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మణరావు వ్యక్తపరిచిన ఆవేదన అక్షరాలా ఆలోచింపజేసేదిగా ఉంది. కోట్ల రూపాయల పెట్టుబడులతో రంగంలోకి దిగిన కార్పొరేట్ సంస్థలు, సామాన్యులను ఆకర్షించేందుకు ఇస్తున్న భారీ డిస్కౌంట్లు స్థానిక వ్యాపార రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయి. స్థానికంగా షాపులు పెట్టుకుని, పన్నులు కడుతూ, రాత్రి పగలు తేడా లేకుండా అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవలందించే చిన్న వ్యాపారులు.. ఈ కార్పొరేట్ ధరల యుద్ధంలో తట్టుకోలేక మూతపడే పరిస్థితి రావడం ఆర్థిక అసమానతలకు దారితీస్తోంది. ఈ సమస్య కేవలం వ్యాపారుల లాభనష్టాలకు మాత్రమే పరిమితమైనది కాదు. దీని వెనుక ప్రజారోగ్యానికి సంబంధించిన పెద్ద ప్రమాదం కూడా పొంచి ఉంది. క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా, ప్రిస్క్రిప్షన్ల సాధుత్వాన్ని సరిగ్గా పరిశీలించకుండా ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా మందులు డెలివరీ కావడం వల్ల డ్రగ్ అబ్యూజ్ (మందుల దుర్వినియోగం) పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలను ప్రభుత్వం విస్మరించకూడదు. ఈ నేపథ్యంలోనే గంధం వెంకటేశ్వర్లు, జహీర్, రామ్ కుమార్ వంటి అసోసియేషన్ ప్రతినిధులు సైతం నియంత్రణ చట్టాల ఆవశ్యకతను నొక్కి చెబుతున్నారు. ఆధునికతను స్వాగతించడం తప్పు కాదు, కానీ అది క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది జీవనోపాధిని దెబ్బతీసేలా ఉండకూడదు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్పొరేట్ ఆన్‌లైన్ సంస్థల ఏకఛత్రాధిపత్యాన్ని, వారి గుత్తాధిపత్యాన్ని అరికట్టేలా కఠినమైన నిబంధనలు తీసుకురావాలి. అటు వినియోగదారులకు రక్షణ కల్పిస్తూనే, ఇటు స్థానిక రిటైల్ మెడికల్ రంగాన్ని కాపాడుకునేలా సమతుల్యమైన విధానాన్ని రూపొందించినప్పుడే ఇలాంటి నిరసనలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# సకాలంలో బి పాజిటివ్ రక్తం అందజేత

❑ **ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



కామారెడ్డి జిల్లా/ మే 17/(జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో సామల సుష్మకు బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయ పల్లి గ్రామానికి చెందిన అధికం నిఖిల్ గౌడ్ సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ వేసవి కాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువత రక్తదానానికి ముందుకు రావాలని, రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్తదాతల తోనే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. రక్తదాత నిఖిల్ గౌడ్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్ అధ్యక్షుడు జమీల్ హైమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, పర్ష వెంకటరమణ, సలహాదారులు జలిగామ శ్రీకాంత్, అంకం బాలకిషన్ లు పాల్గొనడం జరిగింది.

# ఇల్లందులో ముమ్మరంగా ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



ఇల్లందు మే 17 (జన సంఘర్షణ)
ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ స్థానిక 14వ వార్డు కౌన్సిలర్‌నీరుడు ఉపేంద్ర శివలాల్ ఆధ్వర్యంలో వార్డులో విస్తృతంగా పర్యటించారు. నిర్మాణ దశలో నిలిచిపోయిన ఇళ్లను, లబ్ధిదారుల సమస్యలను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తామని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తెలిపారు. అనంతరం, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వార్డు నివాసి అశ్వినిలోత్ కుటుంబాన్ని ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, కౌన్సిలర్లు జాఫర్, విజయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి: కలెక్టర్ అంకిత్




కొత్తగూడెం మే 17 (జన సంఘర్షణ)
సోమవారం (మే 18) నిర్వహించబోయే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరుకావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఉదయం 10:30 గంటలకే కలెక్టరేట్ వేదికగా ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. దూరప్రాంతాల నుండి వచ్చే ప్రజల సౌకర్యాన్ని అంచనా వేస్తూ ఈసారి ప్రజావాణి కేంద్రాలను విస్తరించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, అలాగే కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని సమాంతరంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్దేశిత సమయానికి హాజరై అర్జీలను స్వీకరించాలని ఆయన ఆదేశించారు.

# జలాల్ పూర్‌లో కరెంట్ షాక్‌తో రైతు మృతి





ఉమ్మడి మండలాల వర్ని/మే 17/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా వర్ని మండల్ జలాల్పూర్ శివారులో గిరిజన రైతు సఖి వయసు (52) కరెంట్‌షాక్‌తో మృతి చెందినట్లు వర్ని ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. సిద్దాపూర్ గ్రామానికి చెందిన సఖి జలాల్పూర్ శివారులో తన సొంత పొలంలో పాటు సుమారు 20 ఎకరాల భూమి కౌలుకు చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం పొలం వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు సాగుకు గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు.

# పెట్రో ధరల పెంపుపై బోధన్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం..



బోధన్ /మే 17/(జన సంఘర్షణ)
పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ బోధన్ పట్టణంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తప్పిదాల కారణంగానే సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతోందని ఆరోపించారు. మే 10న హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని పొదుపు సూత్రాల గురించి మాట్లాడి, యుద్ధ సమయాల్లో కూడా ధరలు పెంచకుండా ప్రజలను కాపాడామని చెప్పారని, ఇప్పుడు అదే ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. దేశంలో తగినంత చమురు నిల్వలు ఉన్నప్పటికీ, ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో భారీ ర్యాలీలు నిర్వహించి, ప్రస్తుతం యుద్ధ ప్రభావం పేరుతో ధరలు పెంచి సామాన్యులపై భారం మోపడం అన్యాయమన్నారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, ఏఐపీకేఎస్ జిల్లా నాయకుడు సీహెచ్ రమేష్, పీఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి, బీపాషా బేగం, టీయూసీఐ నాయకులు రెహానా బేగం, సునీత, ఎస్.కే. కాజా, బి. శంకర్, సాయిలు, పోశెట్టి, సలీం, గౌస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గడుగు గంగాధర్ అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్



నిజామాబాద్/మే 17/(జన సంఘర్షణ)
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యా విజయోత్సవ దినం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ తో పాటు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
సోమవారం
18 మే 2026

# కామారెడ్డి కాంగ్రెస్‌లో ముదిరిన ఫైట్.. జిల్లా అధ్యక్షుడిపై వైస్ ప్రెసిడెంట్ ఫైర్!






బిచ్కుంద /కామారెడ్డి/మే 17/(జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ రచ్చకెక్కింది.యువజన కాంగ్రెస్ పార్టీ విధానాలకు విరుద్ధంగా తనను జిల్లా ఉపాధ్యక్ష పదవి నుండి ఎలా తొలగిస్తారంటూ కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యోగేష్ మంచివార్ ప్రశ్నించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో ప్రెస్ మీట్ ఇచ్చారు. యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మధు సుధన్ రెడ్డి ఆయన ఘనం తనపై దుష్ప్రచారం చేస్తూ తనను ఉపాధ్యక్ష పదవి నుండి తొలగించామంటూ ప్రెస్ మీట్ లు పెట్టడంపై ధ్వజమెత్తారు. తనపై కావాలనే కొందరు యూత్ కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి జిల్లాలో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ కాంగ్రెస్ జిల్లా యువజన పార్టీ ఉపాధ్యక్షులు యోగేష్ మంచివార్ ఆదివారం మీడియా సమావేశంలో ఆరోపించారు. తనను జిల్లా ఉపాధ్యక్ష పదవి నుండి తొలగించినట్లు నిన్న ప్రెస్ మీట్ ఇచ్చిన జిల్లా అధ్యక్షులు మధు సుధన్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో మండి పడుతూ ఆయన మాట్లాడారు.జిల్లా అధ్యక్షులు మధు సుధన్ రెడ్డి నలుగురు నాయకులను వెంట వేసుకొని తనపై దుష్ప్రచారానికి తెర లేపారని ఇది సరియైన విధానం కాదని విమర్శించారు. తనను సస్పెండ్ చేసినట్లు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే రాష్ట్ర కార్యవర్గానికి పిర్యాదు చేశానని త్వరలో వారిపై క్రమ శిక్షణ చర్యలకు ఆశిస్తున్నానని అన్నారు. తన పిర్యాదుతో స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు సదరు అంశంపై వివరణకు సైతం ఆదేశించారన్నారు. పార్టీ నియమాలను అతిక్రమించిన వారెవరిని వదిలే ప్రసక్తే లేదని తన పలుకుబడిని ఉద్దేశ్యపూర్వకంగా డ్యామేజ్ చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. వారిపై క్రమ శిక్షణ చర్యలు అయ్యేవరకు తాను వదలని స్పష్టం చేశారు. ఏది ఏమైనా పార్టీ నియమాలకు కట్టుబడి గత 8 ఏళ్లుగా పార్టీ బలోపేతం కోసం తాను పని చేస్తున్నానని తన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాన్ని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

# రహదారిపై మృత్యుఘోష: కారేపల్లిలో క్రేన్ బోల్తా.. డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం




కారేపల్లి మే 17 (జన సంఘర్షణ)
రహదారుల విస్తరణ, భారీ యంత్రాల వినియోగం పెరుగుతున్న కొద్దీ.. వాటి నిర్వహణలో వహిస్తున్న అజాగ్రత్తలు అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారేపల్లి మండలం గాంధీనగర్ పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం దీనికి నిదర్శనంగా నిలిచింది. ఒక భారీ క్రేన్ అదుపుతప్పి రోడ్డుపైనే ప్రమాదకరంగా బోల్తా పడింది. ఈ ఊహించని ప్రమాదంలో క్రేన్ నడుపుతున్న డ్రైవర్ రాజేష్ తీవ్రగాయాలపాలై, క్యాబిన్‌లోనే నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న వెంటనే కారేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక సంఘటనగా కొట్టిపారేయలేం; దీని వెనుక అనేక అనుమానాలు, భద్రతా లోపాలు దాగి ఉన్నాయి. భారీ క్రేన్లు, అంతర్జాతీయ స్థాయి యంత్రాలను నడిపేటప్పుడు డ్రైవర్ల శారీరక శ్రమను, యంత్రాల ఫిట్‌నెస్ (కండిషన్)ను యాజమాన్యాలు ఎంతవరకు పర్యవేక్షిస్తున్నాయనేది ఇక్కడ ఆలోచించాల్సిన ప్రధాన అంశం. నిరంతర పని ఒత్తిడి, లేదా సాంకేతిక లోపాలు ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చట్టప్రకారం పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పటికీ.. పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేము; ఇప్పటికైనా భారీ వాహనాల నిర్వహణపై రవాణా శాఖ, కాంట్రాక్టర్లు కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు కార్మిక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తూనే ఉంటాయి.

# ఈఏపీసెట్‌లో 'స్టేట్ 12వ ర్యాంక్' సాధించిన కందగట్ల హనీష్

- పదో తరగతిలో 97.6%.. ఇంటర్‌లో 97.8%.. నేడు ఈఏపీసెట్‌లో స్టేట్ 12వ ర్యాంక్: స్థిరమైన ప్రతిభకు బ్రాండ్ అంబాసిడర్ 'హనీష్'




TG EAPCET-2026
Telangana Engineering, Agriculture & Pharmacy Common Entrance Test
Conducted by JNTU Hyderabad on behalf of TGCHE
RANK CARD - AGRICULTURE & PHARMACY (A&P) STREAM

Candidate's Name : KANDAGATLA HANEESH
Date of Birth : 11/01/2009
Father's Name : KANDAGATLA GANESH
Mother's Name : KANDAGATLA SRUJANA
Address : 9-110/86/21, GAYATHRINAGAR, BODUPPAL, MEDCHAL MALKAJGIRI, TELANAGANA - 500092
Hall Ticket Number: 2611A01613
Area of Reservation: LOCAL ( OU AREA I.E. TELANGANA STATE)
Category: BC_B
Gender: MALE

| Subject (Max. Marks) | Botany (40) | Zoology (40) | Physics (40) | Chemistry (40) | Total (160) |
|---|---|---|---|---|---|
| Marks Secured (Normalized) | 33.960274 | 32.056415 | 34.05159 | 33.6457 | 133.713979 |

Result: QUALIFIED
Rank in Words: One * Two Rank in Figure: 12
Note: This rank is valid subject to the proof of qualifying exam (10+2) marks and eligibility.
Convener

హైదరాబాద్ ఉప్పల్, మే 17 (జన సంఘర్షణ)
విజయానికి అడ్డదారులు లేవు.. కేవలం నిరంతర శ్రమ, అంకితభావం మాత్రమే దానికి రాజమార్గాలు అని మరోసారి రుజువైంది. తాజాగా విడుదలైన తెలంగాణ ఈఏపీసెట్-2026 ఫలితాలలో బోడుప్పల్ గాయత్రీ నగర్‌కు చెందిన గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థి కందగట్ల హనీష్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో హాల్ టికెట్ నెంబర్ 2611A01613తో రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించాడు. నారాయణగూడ జోన్ శ్రీ చైతన్య విద్యాసంస్థల తరఫున బరిలోకి దిగిన హనీష్ సాధించిన ఈ అసాధారణ విజయం, కేవలం ఆ విద్యాసంస్థకే కాక యావత్ తెలంగాణ ప్రతిభకు దక్కిన గౌరవంగా భావించవచ్చు. హనీష్ విజయం ఒక్కరోజులోనో, లేక అదృష్టం కొద్దీనో వచ్చింది కాదు. చిన్నప్పటి నుంచే చదువులో అత్యంత చురుగ్గా ఉండే హనీష్‌కు విద్యా పునాది ఇంట్లోనే పడింది. పదో తరగతిలో 97.6% మార్కులు, ఆపై ఇంటర్మీడియట్‌లో 97.8% మార్కులతో తన స్థిరమైన ప్రతిభను చాటుకుంటూ వచ్చాడు. మార్కుల వేటలో పడి సగటు విద్యార్థుల్లా ఒత్తిడికి లోనవకుండా, తనకు కష్టమైన సబ్జెక్టులు ఏవి ఉన్నాయో వాటిని గుర్తించి, వాటిపైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టడం హనీష్ ప్రత్యేకత. ఏ విద్యార్థి విజయమైనా వెనుక తల్లిదండ్రుల త్యాగం, సంస్కారంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పాత్ర ఎంతో అమూల్యమైనది. హనీష్ విషయంలో తల్లిదండ్రులు ఇద్దరూ విద్యావంతులు కావడం అతనికి పెద్ద ప్లస్ పాయింట్ అయింది. తండ్రి కందగట్ల గణేష్ ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉన్నప్పటికీ, తల్లి కందగట్ల సృజన ఇంటి దగ్గర ఉంటూ హనీష్ చదువును నిరంతరం పర్యవేక్షించేవారు. కేవలం చదవమని ఒత్తిడి చేయకుండా, చదువుకునే వాతావరణాన్ని ఇంట్లో కల్పించి, ఒక గురువులా హనీష్‌కు శిక్షణ ఇచ్చారు. తల్లి అందించిన ఈ నిరంతర ప్రోత్సాహమే హనీష్‌లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. దీనికి తోడు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉపాధ్యాయులు అందించిన అపారమైన సహకారం, సబ్జెక్టుల వారీగా ఇచ్చిన ప్రత్యేక శిక్షణ మరియు ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తూ వెన్నుతట్టి ప్రోత్సహించిన విధానం తనను ఈ అగ్ర స్థానంలో నిలబెట్టాయని హనీష్ కృతజ్ఞతతో చాటుకున్నాడు. మరోవైపు, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న తండ్రి కందగట్ల గణేష్ తన వృత్తిపరమైన అనుభవాన్ని కొడుకు ప్రగతికి ఇంధనంగా మార్చారు. సబ్జెక్టుల పరంగా ఉన్న లోతులను హనీష్‌కు వివరిస్తూ నిరంతరం గైడ్ చేశారు. "ఒక చిన్న గ్రామం నుంచి వచ్చి, హైదరాబాద్ బోడుప్పల్ గాయత్రీ నగర్‌లో స్థిరపడి, నా కొడుకుకు ఒక మంచి విజన్ అందించాలని కష్టపడ్డాను.. ఈరోజు వాడు సాధించిన విజయం నా శ్రమను మర్చిపోయేలా చేసింది" అంటూ ఒక సాధారణ తండ్రిగా గణేష్ వ్యక్తపరిచిన భావోద్వేగం, ప్రతి మధ్యతరగతి తండ్రి పడే తపనకు అద్దం పడుతోంది. భవిష్యత్తులో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ లేదా జిప్‌మర్ వంటి ఉన్నత సంస్థలలో మెడిసిన్ (వైద్యం) చదివి, సమాజానికి సేవ చేయడమే తన జీవిత ఆశయమని ఈ సందర్భంగా హనీష్ సగర్వంగా ప్రకటించాడు. హనీష్ సాధించిన ఈ 12వ ర్యాంక్ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని ఆలోచింపజేస్తుంది. నేటి కార్పొరేట్ విద్యా ప్రపంచంలో ర్యాంకులు అంటే కేవలం బట్టీ పద్ధతులు, ఒత్తిడి అనే విమర్శలు ఉన్న తరుణంలో.. హనీష్ కథ పూర్తిగా భిన్నమైనది. తల్లిదండ్రుల సరైన గైడెన్స్, ఉపాధ్యాయుల నిరంతర తోడ్పాటు, విద్యార్థి స్వీయ విశ్లేషణ, క్రమశిక్షణ తోడైతే ఎలాంటి ఒత్తిడి లేకుండానే అద్భుతాలు సృష్టించవచ్చని ఈ విజయం నిరూపించింది. నగరాల ఆకర్షణలకు లోనవకుండా, తన మూలాలను మరిచిపోకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించిన కందగట్ల హనీష్ ప్రయాణం, భవిష్యత్ తరాల విద్యార్థులకు నిరంతర స్ఫూర్తిదాయకం.

## ప్రేమజంట పెళ్లి వ్యవహారం.. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై



భీమవరం:/మే 17/(జన సంఘర్షణ)
పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ పి.నాగరాజు, కానిస్టేబుల్ బాలకృష్ణ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఓ ప్రేమ జంట పెళ్లి వ్యవహారంలో ఎస్ఐ బెదిరించి రూ.70 వేలు లంచం అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బాధితులుఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో.. గురువారం లంచం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ లో తనిఖీలు చేస్తున్నారు.

## చుంచుపల్లి: తల్లీ, కూతుళ్లు ఆత్మహత్య



చుంచుపల్లి మే 17 (జన సంఘర్షణ)
చుంచుపల్లి మండలం బాబుక్యాంపులో విషాదం చోటుచేసుకుంది. బాబు క్యాంపునకు చెందిన రమ్య (35) భర్త మరణాన్ని తట్టుకోలేక కూతురితో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గత నెల 28న కూతురికి విషం తాగించి, తాను విషం తాగి ఆత్మహత్యా యత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా.. 20 రోజుల నుంచి చికిత్స పొందుతూ ఆదివారం ఇద్దరూ మృతి చెందారు.

## మైనర్ ' టు ' మేజర్ .. మధ్యలో పోలీసులు ఏమీ చేశారు బ్రదర్




అనంతపురం జిల్లా:/మే 17/(జన సంఘర్షణ)
మైనర్ ' టు ' మేజర్ ప్రేమ వ్యవహారంలో అనంతపురం జిల్లా త్రీ టౌన్ పోలీసులపై నిందలు.యువతిని బూతులు తిట్టారు అంటు ఓ సోషల్ మీడియాలో పోలీసుల పై విమర్శలు. విచారణ చేస్తే కూడా పోలీసులపై నిందలు వేస్తున్నారు అంటు అమ్మాయి తల్లిదండ్రులు పోలీసులకు సపోర్ట్ చేస్తూ కృతజ్ఞతలు. హాట్స్ ఆఫ్ అనంతపురం జిల్లా పోలీసులు అంటు అదే సోషల్ మీడియా వేదికగా వైరల్ వీడియోలు.మైనర్ టు మేజర్ అమ్మాయి లవ్ చేస్తూ అబ్బాయి వెంట వెళ్ళిపోయేలా చేసిన యువతీ .. ఆ యువతిని విచారించిన అనంత త్రీ టౌన్ పోలీసులు .. పోలీసుల పైనే నిందలు వేసిన ఆ యువతీ. విచారణ చేసిన, నిందలు వేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వారు ప్రజలు, అమ్మాయి తల్లిదండ్రులు ఎస్పీ జగదీష్‌కి విన్నపం. అనంతపురం జిల్లా వ్యాప్తంగా తక్కువ సిబ్బంది ఉన్న గంటల వ్యవధిలోనే కేసులు పరిష్కరిస్తున్న అనంత పోలీసులకు హాట్స్ ఆఫ్ .. జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు. పేర్కొన్నారు.


## అధికారుల 'షాక్'.. సమాజమా ఆలకించు: కాళ్లు లేని హిడ్మా దీనగాథపై స్పందన ఏది?




ఇల్లందు మే 17 (జన సంఘర్షణ)
ఆరేళ్ల క్రితం జరిగిన ఒక విద్యుత్ ప్రమాదం ఆ కుటుంబంలో చీకట్లు నింపితే, మన ప్రభుత్వ వ్యవస్థల అలసత్వం ఆ చీకట్లను మరింత దట్టం చేసింది. చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన మడకం హిడ్మా విద్యుత్ షాక్‌తో రెండు కాళ్లు పూర్తిగా కోల్పోయి, ఎడమ చేయి పడిపోయి మంచానికే పరిమితమవ్వడం.. అతని భార్య సుశీల కూలి పనులు చేస్తూ ఆ కుటుంబాన్ని ఈడ్చుకురావడం వర్తమాన సమాజపు నిస్సహాయతకు అద్దం పడుతోంది. చట్ట ప్రకారం అందాల్సిన ప్రభుత్వ నష్టపరిహారం కోసం చర్ల ఎంపీడీవో చుట్టూ, మండల అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంపై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, నాయకులు ఇచ్చే సంక్షేమ నినాదాలు ఇలాంటి నిరుపేద, వికలాంగ కుటుంబాల దాకా ఎందుకు చేరడం లేదనేది ఇక్కడ ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన ప్రశ్న. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి హిడ్మాకు ఇందిరమ్మ ఇల్లు, మూడు చక్రాల స్కూటీ మంజూరు చేయడంతో పాటు.. సమాజంలోని దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి అతనికి కృత్రిమ కాళ్లు అమర్చేందుకు, ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు చేయూతనివ్వాల్సిన అత్యవసర సమయమిది.

## బండి భగీరథ్ కేసు.. సోషల్ మీడియా పోస్టులపై కేసు నమోదు

- బండి భగీరథ్ కేసు విషయంలో న్యాయమూర్తిపై అనుచిత పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



హైదరాబాద్/మే 17/(జన సంఘర్షణ)
పోక్సో కేసులో బండి భగీరథ్ శనివారం రాత్రి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసు సందర్భంగా సోషల్ మీడియాలో ప్రజలు రెండు వర్గాలు విడిపోయి పోస్టులు పెట్టారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌కు అనుకూలంగా బాలికదే తప్పు అన్నట్లు పలువురు పోస్టులు చేశారు. ఆమె ఫొటోలు, వీడియోలు సైతం వైరల్ చేశారు. కొందరు భగీరథ్‌ను అరెస్ట్ చేయకపోవడంపై పోలీసులను ప్రశ్నించారు. భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. కోర్టు కొట్టివేసింది. అయితే బెయిల్ పిటిషన్ విచారణకు రాకముందు పలువురు సోషల్ మీడియాలో న్యాయమూర్తిపై పోస్టులు పెట్టారు.

**ఫిర్యాదు చేసిన రిజిస్ట్రార్?**

బండి భగీరథ్ ముందస్తు బెయిల్ విచారణ సందర్భంగా మహిళా జడ్జిపై సోషల్ మీడియాలో అనుచిత ఆరోపణలు చేశారు. బెయిల్ మంజూరు చేస్తే జడ్జి మాధవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ ఇస్తారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. విచారణ సందర్భంలో సోషల్ మీడియా పోస్టులపై జడ్జి మాధవి ప్రస్తావించారు. అనంతరం పలు సోషల్ మీడియా పోస్టులపై హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చార్మినార్ పోలీసులు , కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి పోస్టులతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు అపనమ్మకం ఏర్పడుతుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ చౌడేశ్వరి మాత కళ్యాణ మహోత్సవ వేడుకలు...

రుద్రూర్, మే 17 ( జన సంఘర్షణ) :





రుద్రూర్ మండల కేంద్రంలోని దేవాంగుల ఆరాధ్య దైవమైన శ్రీ రామలింగ చౌడేశ్వరి ఆలయంలో ఆదివారం శ్రీ చౌడేశ్వరి మాత కళ్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భాజాభజంత్రిలతో మహిళలు మంగళ హారతులతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్యామ్ సుందర్ పహాడే, దేవాంగ కులస్తులు ఈర్వ శ్రీనివాస్, లోగం రాజేష్, ఓంకార్ స్వామి, లోగం సురేష్, తొప్పరి శివ, కాట్రపు రాజు, తొర్తి చందర్, బల్మి ప్రణయ్, క్రాంతి కుమార్, ఈర్వ నాగరాజు, కాట్రపు సాగర్, ఈర్వ అవినాష్, ఈర్వ క్రాంతి, బల్మి ఉమాకాంత్, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# నవ ఇల్లందు నిర్మాణానికి ప్రజా సంకల్పం: రేపు ప్రతిష్ఠాత్మక '1కే రన్'

ఇల్లందు మే 17 (జన సంఘర్షణ)



పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ఇల్లందులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇందులో భాగంగా సోమవారం (మే 18) ఉదయం 8 గంటలకు పట్టణంలోని ప్రముఖ కూడలి గోవింద్ సెంటర్ నుండి కొత్త బస్టాండ్ వరకు '1కే రన్' పరుగును అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అధికారికంగా ప్రకటించారు. ఈ పరుగు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, పట్టణ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించే ప్రతి ఒక్కరి ఆశయ సాధనకు ప్రతీక. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇల్లందు పట్టణ ప్రజలు, మున్సిపల్ యంత్రాంగం, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత , క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ఈ పరుగును విజయవంతం చేయడం ద్వారా నవ ఇల్లందు నిర్మాణానికి అందరం ఏకతాటిపై ఉన్నామనే గొప్ప సందేశాన్ని చాటిచెప్పాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# నాకు ఒక గంజాయి ప్యాకెట్ ఇప్పించండి సార్..!!

❑ మీ కాళ్లు పట్టుకుంటా

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం/మే 17/(జన సంఘర్షణ)



గంజాయి కోసం సెల్ టవర్ ఎక్కి ఫీట్లు చేసిన యువకుడు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పట్టణంలోని తిరుమలగిరి కాలనీలో మద్యం మత్తులో యువకుడు హనుమంతు హల్చల్. యువకుడితో చాకచక్యంగా మాట్లాడి, కిందికి దించి ఆసుపత్రికి తరలించిన పోలీసులు పేర్కొన్నారు.

# చీకటి చాటున 'బోరు' దందా: ఐటీడీఏ వెనుక అర్ధరాత్రి తవ్వకాలు..

భద్రాచలం మే 17 (జన సంఘర్షణ)

చట్టం తన పని తాను చేసుకుపోతుందో లేదో తెలియదు కానీ, అక్రమార్కులు మాత్రం తమ పనిని నిరాటంకంగా ముగించుకుపోతున్నారు. భద్రాచలంలోని అత్యంత కీలకమైన ఐటీడీఏ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న రాజీవ్ నగర్ కాలనీలో గత రాత్రి చోటుచేసుకున్న ఘటనే దీనికి సజీవ సాక్ష్యం. నిగూఢంగా ఉండాల్సిన అర్ధరాత్రి వేళ, ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని భారీ బోర్ వెల్ యంత్రాలతో భూగర్భాన్ని తవ్వేయడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. అసలు ఈ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా సాగిస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు కాలనీలో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా నివాస ప్రాంతాలలో భూగర్భ జలాల స్థాయిని కాపాడటానికి వాల్టా చట్టం ప్రకారం ఎన్నో కఠిన నిబంధనలు ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు బోర్లు వేయడానికి వీల్లేదు. ఒకవేళ అనుమతి ఉన్నా, పగటిపూట మాత్రమే పనులు నిర్వహించాలనే కనీస నియమాలు ఉన్నాయి. అలాంటిది, అందరూ నిద్రిస్తున్న అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా బోర్ పాయింట్లు తవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? పగలు చేస్తే చట్టం పట్టుకుంటుందనే భయమా, లేక అధికారుల కళ్లెదుటే ఈ అక్రమాన్ని సాగించలేక చీకటిని ఆశ్రయించారా? అన్నది విజ్ఞులైన





ప్రజలు ఆలోచించాల్సిన విషయం. ఈ మొత్తం వ్యవహారంలో స్థానిక అధికారుల వైఖరి తీవ్ర విమర్శలపాలువుతోంది. పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున భారీ శబ్దాలతో అర్ధరాత్రి బోరు బండి తిరుగుతుంటే, కనీసం నిఘా పెట్టాల్సిన మున్సిపల్, రెవెన్యూ, లేదా పోలీస్ యంత్రాంగం ఏం చేస్తోందనేది మింగుడుపడని ప్రశ్న. కాలనీవాసులు శబ్ద కాలుష్యంతో అల్లాడిపోతుంటే, నిబంధనలను కాపాడాల్సిన రక్షక వ్యవస్థలు నిద్రమత్తులో జోగుతున్నాయా? లేక అక్రమార్కులతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయా? అనే అనుమానాలు ప్రజల్లో బలంగా నాటుకుపోతున్నాయి. ఒక ప్రభుత్వ కార్యాలయం వెనుకే ఇంతటి బరితెగింపు ఉందంటే, ఇక అంతర్గత ప్రాంతాల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అక్రమ తవ్వకాల వల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటిపోయి సామాన్యులకు తాగునీరు కూడా దొరకని ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఆ అర్ధరాత్రి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయో లేదో తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేదంటే, చట్టాలు కేవలం పేపర్లకే పరిమితమని, అక్రమార్కులకు చీకటే రాజమార్గమని వ్యవస్థే ఒప్పుకున్నట్లవుతుంది.

# మసాజ్ పేరుతో 61 మందిపై వేధింపులు..

❑ **భారత సంతతి వ్యక్తికి 13 ఏళ్ల జైలు శిక్ష**

ఆస్ట్రేలియా/మే17/జనసంఘర్షణ)

ఆస్ట్రేలియాలో మసాజ్ థెరపీ పేరుతో మహిళలను వేధించిన భారత సంతతి వ్యక్తికి అక్కడి న్యాయస్థానం భారీ శిక్ష విధించింది. మసాజ్ పేరుతో 61 మందిపై వేధింపులు.. భారత సంతతి వ్యక్తికి... భారత సంతతి వ్యక్తికి 13 ఏళ్ల జైలు శిక్ష. దాదాపు 61 మంది మహిళలను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి 13 సంవత్సరాల 10 నెలల జైలు శిక్ష ఖరారైంది. అంతేకాకుండా, శిక్షా కాలం ముగిసిన వెంటనే అతడిని దేశం నుండి బహిష్కరించాలని (డిపోర్ట్ చేయాలని) కోర్టు సంచలన తీర్పునిచ్చింది.

**నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం..**

అధికారుల వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన సుమిత్ (39) అనే వ్యక్తి 2011లో ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. మసాజ్ థెరపీలో అతనికి ఎలాంటి అధికారిక అర్హతలు, లైసెన్స్‌లు లేవు. అయినప్పటికీ అక్రమ మార్గంలో అక్టోబర్ 2021 నుండి జూలై 2022 మధ్య కాలంలో ఓ మసాజ్ పార్లర్‌లో థెరపిస్ట్‌గా చేరాడు. ఆ సమయంలో చికిత్స కోసం వచ్చే మహిళలను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా బాధితులకు తెలియకుండా వారి రహస్య వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేశాడు.



**తప్పులను ఒప్పుకున్న నిందితుడు..**

ఈ దారుణంపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు సుమిత్‌పై మొత్తం 97 అభియోగాల కింద కేసులు నమోదు చేశారు. విచారణ సమయంలో నిందితుడు కోర్టులో తన తప్పులన్నింటినీ అంగీకరించాడు.

**ఆతీవ్ర ఆగ్రహం..**

ఈ కేసుపై విచారణ జరిపిన ఆస్ట్రేలియా న్యాయస్థానం నిందితుడి ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చికిత్స కోసం నమ్మి వచ్చిన మహిళల భద్రతను, నమ్మకాన్ని అతడు దారుణంగా దుర్వినియోగం చేశాడని, ప్రొఫెషనల్ విలువలని పూర్తిగా కాలరాశాడని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నేరం తీవ్రతను బట్టి అతనికి దాదాపు 14 ఏళ్ల జైలు శిక్ష విధించడమే కాకుండా, శిక్ష పూర్తి కాగానే దేశం సరిహద్దుల నుంచి వెళ్లగొట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బీర్కూర్./మే 17/(జన సంఘర్షణ)





అతివేగం, నిర్లక్ష్యం, మద్యం మత్తులో వాహనాలు నడపడం పలువురు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అతివేగంగా మద్యం తాగి వాహనాలు నడపకూడదని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఇంకా మార్పు రావడం లేదు. స్థానికంగా ఉన్న పోలీసులు దీనిపై సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి వచ్చేవరకు ఇల్లాలితో పాటు పిల్లలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాల బారిన పడడం వారి కుటుంబాలు రోడ్డుమీదికి వస్తున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లాబాన్సువాడ మండలం కొల్లూరు బాన్సువాడ నుంచి బీర్కూరు పోయే రోడ్డుపై తవేరా ఫోర్ వెహికల్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడం ద్విచక్ర వాహనంపై ఉన్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బీర్కూర్ మండలం అన్నారం గ్రామం చెందిన చాకలి శేఖర్గ గుర్తించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించారు. బాన్స్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈనెల 23న ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వేద పాఠశాల శంకుస్థాపన రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం






యాదగిరిగుట్ట/మే 17/(జన సంఘర్షణ )

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పరిధిలో ఈ నెల 23న ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వేద పాఠశాల శంకుస్థాపన, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టే కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, యాదగిరిగుట్ట దేవస్థాన అర్చక బృందం, ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్ పాల్గొన్నారు.

## సుబ్రమణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కార్వేటినగరం మే 17 జనసంఘర్షణ

కార్వేటి నగరంలో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు పాలు పెరుగు తేనె హరిద్రవం తో కూడిన అభిషేకం నిర్వహించారు. పుష్పాలు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాన్ని పులిచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, చిరంజీవి రెడ్డి సురేష్ తులసి రామ్ రెడ్డి ఎంపీడీవో రాధికా సింగిరెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రామ్ శెట్టి రాజశేఖర్ కార్యనిర్వహణాధికారి కృష్ణ నాయక్, కమిటీ సభ్యులు ఎర్రగోటి రాధాకృష్ణ యాదవ్, వినయ్ గోవింద్ స్వామి సెల్వి అమరావతి భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా మహిళామోర్చ ప్రెసిడెంట్ కవితకు గౌరవ డాక్టరేట్..

- మహిళా సాధికారతకు చేసిన సేవలకు గుర్తింపు...



వికోట, మే 17 జనసంఘర్షణ

వికోట పట్టణానికి చెందిన జిల్లాస్థాయి భాజపా మహిళకు ప్రసిద్ధ అంతర్జాతీయ యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ లభించింది. మహిళా సాధికారతకు తనవంతు చేస్తున్న కృషికి గాను ఉమ్మడి చిత్తూరు జిల్లా భాజపా మహిళా విభాగమైన మహిళామోర్చా అధ్యక్షురాలు జి కవితారాజును అమెరికన్ యునైటెడ్ యూనివర్శిటీ వారి గౌరవ డాక్టరేట్ వరించింది. ఆదివారం చెన్నైలో జరిగిన గౌరవ డాక్టరేట్ల ప్రధానోత్సవంలో తమిళనాడు హైకోర్టు మాజీ జడ్జి డా.వెంకటేశన్ తో పాటు పలువురు దేశ-విదేశీ ప్రముఖులచే ఆమె ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని, మహిళా సాధికారత, స్వాలంబనలతో పాటు అన్ని రంగాల్లో స్త్రీల భాగస్వామ్యాన్ని పెంచేదుకు కార్యక్రమాలు వేగవంతం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్-ఫౌండర్ కె. వెంకటేశన్ తోపాటు ఎమ్.రాజలక్ష్మి, (డిస్ట్రిక్ట్ జడ్జ్ ఒ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్) (రిటైర్డ్), డా.హరిదాస్,(ఆంధ్రప్రదేశ్ మాజీ జిల్లా న్యాయమూర్తి), అనస్తాసియా గిలిఢల్లీ (మైనారిటీల కమిషన్ మాజీ సభ్యురాలు), డా.సందీప్ కుమార్ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విభాగాధిపతి ఒ అదనపు బాధ్యతల పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్), ఎన్ ఐఐఎల్ ఎం యూనివర్సిటీ, కైతాల్ హర్యానా, అనుసూయ డెయిసీ ఎర్నెస్ట్సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్), తమిళనాడు, ఆర్ రామకృష్ణన్, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,తమిళనాడు) ,నిత్య గుప్తా (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఆఫ్రికా ఇండియా ఎకనామిక్ ఫౌండేషన్),డా. వల్లికణ్ణన్ (సీనియర్ వైస్ ప్రెసిడెంట్, యాక్సిస్ బ్యాంక్),యూనివర్సిటీ కోఆర్డినేటర్ రమేష్ బాబు, ఉషారాణి, వాసు ,కవిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నరేష్ రెడ్డికి ఘన సత్కారం

- వెదురుకుప్పం మండలం పాచ్చికాపాలంలో నరేష్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



వెదురు కుప్పం. మే 17 జనసంఘర్షణ

వెదురుకుప్పం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులైన మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన బోడి రెడ్డి నరేష్రెడ్డిని ఘనంగా సత్కరించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైద్య విభాగం అధ్య క్షుడు ప్రకాష్, సాంస్కృతిక విభాగం మండల అధ్యక్షుడు రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్కట్ చేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. వైఎస్సార్ సీపీలో జిల్లాస్థాయి పదవి రావడంపై పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమం త్రి నారాయణస్వామి, సమన్వయకర్త కృపా లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో యువతకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటానికి యువతను సన్నద్ధం చేస్తామన్నా రు.మాజి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జడ్పిటిసి సుకుమార్, ఎంపీపీ నాగ హేమ సుందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శిల్పారామయ్య, వైసిపి బట్టి సుబ్రహ్మణ్యం, కోఆప్షన్ నెంబర్ వెంకటేష్, గోవిందం, వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు చిరంజీవి రెడ్డి,విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు జగ దీశ్ రెడ్డి, నాయకులు ఈశ్వరరెడ్డి, చిట్టి, మురళీ రెడ్డి, రేణుక, నరేష్, బాలాజి పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సల్లాపూరెమ్మ తల్లి పుష్పాపల్లకి వేడుకలు

- భక్తులకు కనువిందు చేస్తున్న పూల గెరిగా..



బైరెడ్డిపల్లి, మే17 జనసంఘర్షణ

బైరెడ్డిపల్లి లో దళితవాడలో నెలకొనివున్న శ్రీ సల్లాపూరెమ్మ జాతర అమ్మవారి పుష్పపల్లకి వేడుకలు తో దాదాపు ముగిసింది. ఈపుష్పాపల్లకి వేడుకలు శనివారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన ది. ఈ పల్లకిని కర్ణాటరాష్ట్రం కె.జి.ఎఫ్ పట్టణం కు చెందిన కళాకారులు చే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శ్రీ సల్లాపూరెమ్మ ఉత్సవ మూర్తిని ప్రత్యేక అలంకరణచేసి పల్లకిని అధిరోహించినారు. అనంతరం బాణాసంచా వేడుకలు, పిల్లనగ్రోవులు, కోలాటం, కీలుగుర్రాలు, వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండు మేళాలు,డప్పు వాయిద్యాలు,ఈ కార్యక్రమంలో పూల గెరిగా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# పేదలకు ఉన్నత విద్య అందని ప్రభుత్వం

- వైఎస్సార్సీపీ నాయకుల ఆందోళన




వెదురు కుప్పం. మే 17, జనసంఘర్షణ

వెదురుకుప్పం: పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్న ఉద్దేశ్యంతో అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వినతితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వెదురుకుప్పం మండలానికి డిగ్రీ కళాశాలను మంజూరు చేశారని అయితే కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లైనా కూశాల భాగోగుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని వైఎస్సార్సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని పచ్చికాపల్లంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో ముళ్ల కంపలు, రాళ్లు రప్పలతో నిండిపోవడంతో నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసంధర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా వెదురుకుప్పంలో డిగ్రీమాశాల మంజూరు చేయాలని విన్నవించడంతో అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే డిగ్రీ కళాశాల మంజూరు చేసినట్లు చెప్పాడు. అయితే డిగ్రీ కళాశాల తరగతి గదుల నిర్మాణం కోసం పచ్చికాపల్లం సమీపంలో సుమారు 11ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా రెవిన్యూ అధికారులు కేటాయించినట్లు తెలిపారు. భవన నిర్మాణాల కోసం అప్పట్లోనే రూ. 17.82,50,000 లు మంజూరైనట్లు. చెప్పారు. అప్పట్లోనే జీ ప్లస్ భవన నిర్మాణాలకు సంబందించి ఇంజినీరింగ్ అధికారులు స్థల పరిశీలన కూడా చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయి ఒనన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్నా డిగ్రీ కళాశాల అభివద్ధి శిధిల వ్యవస్థకు చేరిన దాన్ని గురించి వాటిలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే నిమలు మంజూరైనట్లు ప్రకటనలు చేసుకుని పాలాభిషేకం చేసిన కూటమి నాయకులు ఇంత వరకు విద్యార్థుల అవస్థలను పట్టించుకోవడం లేదన్నారు. పేదం చదువుల పట్ల కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోందని మండిపడ్డారు. అనంతరం వాణిజ్యా విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమ సుందర్ రెడ్డి, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇది సంక్షేమంపై ప్రభుత్వం చూపాలి అన్నారు. మారు మూల గ్రామంలో డిగ్రీ కళాశాల రావడం గొప్పగా వాటిని బాగోగుల పట్ల ప్రభుత్వం ఆలస్యం చేస్తున్నారు. భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నాది. చవటగుంట జూనియర్ కళాశాలలో తరగతు నిర్వహించడంతో అనేక సమస్యలు ఉన్నట్లు చెప్పాడు సమ్మిత్తులో అక్కడ ప్రభుత్వ కళాశాల ఉంటుందో రద్దు చేస్తారో తెలియని స్థితిలో ఉన్నట్లు నిర్యాత్తల తల్లిదండ్రుల ఆందోళ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కళాశాల ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలియజేశారు. నాయకులు జడ్పిటిసి సభ్యుడు సుకుమార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, కార్యదర్శి నరేష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందన్ కేప్షన్ నెంబర్ వెంకటేష్, వైఎస్ఆర్సిపి కార్యదర్శి మురళీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీష్ రెడ్డి మునికృష్ణారెడ్డి, నాయకులు పరుండ్డి వెంకటేష్ ఉన్నారు.

## ఏనుగుల దాడి పంట నష్టం కోసం గజ ప్రజ యాప్



సదుం, మే 17 జనసంఘర్షణ

రైతులకు ఏనుగుల వల్ల పంట నష్ట పరిహారం జరిగితే అందుకోసం ప్రభుత్వం కొత్తగా గజా ప్రజ అనే మొబైల్ అప్లికేషన్ను తీసుకు వచ్చింది. ఇప్పటివరకు ఏనుగుల దాడిలో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం పొందాలంటే మొదట అటవీ బీట్ అధికారి ఫోటో తీసి, ఎఫ్ బి ఓ ఎఫ్ ఎస్ ఓ లు ,సంతకం చేసి అనంతరం వీఆర్వో ,తాసిల్దార్, వ్యవసాయ అధికారి హార్టికల్చర్ అధికారీ లు సంతకాలు చేసేవారు .చివరగా ఫారెస్ట్ రేంజ్ అధికారి , జిల్లా ఆటో అధికారి సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపేవారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే డిడి రూపంలో నగదు జమ అయ్యేది. ప్రస్తుతం ఈ పద్ధతి మార్చి కొత్తగా గజా ప్రజ మొబైల్ యాప్ తీసుకుని వచ్చారు. దీని ప్రకారం ఏనుగులు పంట నష్టం కలగజేస్తే రైతులు వారి పొలాల్లోనే నిలబడి గజ ప్రజా అనే అప్లికేషన్ లో ఫోటో తెస్తే సరిపోతుంది.తదుపరి పైన తెలిపిన అధికారులు అందరూ ఈ మొబైల్ యాప్ లోనే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు.నిధులు విడుదల అయిన తర్వాత బ్యాంకు ఖాతా లో జమ అయినట్లు సంబంధిత రైతులకు మెసేజ్ వస్తుంది.

## ఆళ్లగడ్డ వద్ద సదుం వాసి మృతి



సదుం, మే 17 జనసంఘర్షణ

సదుం మండలం కంబంవారిపల్లి పంచాయతీ కురవపల్లికు చెందిన కొప్పల సుబ్రమణ్యం ఆళ్లగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన బస్ లో హైద్రాబాద్ కు వెళుతుండగా ఆయన కూర్చుని ఉన్న వైపున ట్రక్కు ఢీకొన్నది. దీంతో ఆయన అక్కడికక్కడ మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా అనంతరం ఆదివారం రాత్రి ఆయన స్వగ్రామమైన కురవపల్లెకు తీసుకొని వచ్చారు. సోమవారం దహన క్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## సదుం మండల కురుబ కమిటీ ఎన్నిక



సదుం, మే 17 జనసంఘర్షణ

సదుం మండలం కురవ కుల కమిటీ ఎన్నికలు ఆదివారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద జరిగాయి. ఈ ఎన్నికలు వెంకటప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా మారాణి వెంకటనారాయణ బాబు (పాపి రెడ్డి పల్లి), మండల అధ్యక్షుడుగా బడుకూరి నారాయణ గౌడ్ చింతల వారి పల్లె ఉపాధ్యక్షుడుగా జి వెంకటరమణ బుర్రకమంద బి గంగయ్య బల్లవారిపల్లెలో ఎన్నికయ్యారు. అదేవిధంగా రెడ్డివారిపల్లెకు చెందిన తీర్థం మోహన్ ప్రధాన కార్యదర్శిగాను, బూరగ మందకు చెందిన వేణుగోపాల్ , రెడ్డివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, తిమ్మనాయనపల్లి చెందిన పరంధాములు ఉప కార్యదర్శులుగాను, కోశాధికారిగా డి. పురుషోత్తం ఉన్నారు.


## శ్రీ సల్లాపూరెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేపట్టిన మొగశాల సోదరులు



బైరెడ్డిపల్లి మే17 జనసంఘర్షణ

బైరెడ్డిపల్లిలో వెలిసివున్న శ్రీ సల్లాపూరెమ్మ తల్లి జాతర మహోత్సవం 3వ రోజు శనివారం రాత్రి అమ్మవారికి మొగసాల సోదరులు కృష్ణమూర్తి, రేదెప్పలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికి సత్కరించారు.వేద పండితులు వారికి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారితోపాటు మాజీ సర్పంచ్ వెంకటేష్, జిల్లా వైకాపా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శైలేష్ చక్రవర్తి, మండలవైకాపా యువజన విభాగం అధ్యక్షుడు, స్థానిక నాయకులు, వైకాపా శ్రేణులు పాల్గొన్నారు.

## బోయకొండపై అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీ



చౌడేపల్లి మే 17 జనసంఘర్షణ

శక్తి క్షేత్రం బోయకొండ పై ఆదివారం భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది వేసవి సెలవులు కావడంతో రాష్ట్రం తో పాటు కర్ణాటక తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు బోయకొండకు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూ లైన్ లన్నీ భక్తులతో కిటకిట లాడాయి ముఖ్యంగా కొండపైకి వాహన రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ఆలయ పేద పండితులు అర్చకులు అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏకాంబరం యాత్రికుల వసతులను సమకూర్చారు. ఆలయ అధికార అర్చక సిబ్బంది సేవలందించారు. చౌడేపల్లి ఎస్ఐ చిన్న రెడ్డప్ప కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## శ్రీ సల్లాపూరెమ్మ జాతరలో పాల్గొన్న సేవాతత్పరుడు మురుగన్

- ఘనస్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు



బైరెడ్డిపల్లి ,మే17 జనసంఘర్షణ

బైరెడ్డిపల్లిలో కోలాహలంగా కొనసాగుతున్న శ్రీ సల్లాపూరెమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో శనివారం రాత్రి మూడవ రోజు గంటావూరు గంగమ్మ గుడి చైర్మన్, సేవాతత్పరుడు అయిన డాక్టర్ మురుగన్ పాల్గొన్నారు. ఆయనకు మేళతాళాలు,డప్పు వాయిద్యాలు తో ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించాకొన్నారు.

# పూరి జగన్నాథ్ పుణ్యక్షేత్రం వేదికగా మక్తల్ చిన్నారుల భరత నాట్య నృత్య ప్రదర్శన

- బారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో
-జై జగన్నాథ్ జగన్నాథ సంగీత నృత్య మహోత్సవం...
- నాట్య గురువు హారతి జ్యోషి వారి శిష్య బృందంకు ఘన సన్మానం

మక్తల్, మే 17

ఒడిశా రాష్ట్రం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుని క్షేత్రం వేదికగా తెలంగాణ రాష్ట్రం, నారాయణపేట జిల్లా, మక్తల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఆధ్యనృత్యాలయ భరతనాట్య అకాడమీ ఆధ్వర్యంలో గురువు హారతి జ్యోషి వారి శిష్య బృందం అద్భుతమైన భరతనాట్య నృత్య ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించడం జరిగింది. భరతనాట్యం యొక్క ప్రధాన విశేషం అది భావం (భావన), రాగం (సంగీతం), తాళం (లయ) ఈ మూడింటినీ ఖచ్చితంగా మేళవిస్తూ, హస్త ముద్రలు, ముఖ కవళికలు, పాద చలనాల ద్వారా నవరసాలను (తొమ్మిది భావోద్వేగాలు) వ్యక్తం చేస్తూ గురు హారతి జ్యోతి ఆధ్వర్యంలో ఎంతో అద్భుతమైన ప్రదర్శన చేశారు మక్తల్ చిన్నారి కళాకారులు. తమిళనాడులోని పురాతన దేవాలయాలలో ఉద్భవించిన శాస్త్రీయ నృత్యం; భరతముని రాసిన "నాట్య శాస్త్రం" ఆధారంగా భరతనాట్యం ప్రదర్శనను మక్తల్ చిన్నారులు చేయడం ఎంతో అద్భుతం అమోఘం. అప్పట్లో దేవాలయాలలో పవిత్ర ఆచారంగా, దేవతల పట్ల భక్తిని వ్యక్తపరిచే మాధ్యమంగా నవరసాలైన ప్రేమ, నవ్వు, కరుణ, కోపం, ధైర్యం, భయం, అసహ్యం, ఆశ్చర్యం, శాంతి -- ఈ తొమ్మిది భావోద్వేగాలను ముఖ కవళికలతో వ్యక్తం చేస్తూ ప్రదర్శించే ఇట్టి భరతనాట్యాన్ని మక్తల్ పట్టణానికి చెందిన ఆధ్యనృత్యాలయ భరతనాట్య అకాడమీ చిన్నారులు ప్రదర్శించడం ఈ ప్రాంత వాసులను ఎంతగానో



సంతోషంతో ముంచేస్తుంది అని చెప్పక తప్పదు. తమిళనాడు ధార్మిక ఇతివృత్తాలు, హిందూ మత భావాలను (ముఖ్యంగా శైవమతం) సంగీతం, లయలతో మేళవిస్తున్న ఇట్టి భరతనాట్యాన్ని మక్తల్ చిన్నారులు ప్రదర్శించడం అద్భుతం ఆంగ్మ్యాకంగా చెప్పుకోక తప్పదు. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థినులు వారి తల్లి దండ్రులు అయినా సాయి సప్తశ్రీ, మేదిని, ఆధ్య,ప్రిశ ,బృంద,హాసిని,ఆధ్య గౌడ్. రంజిత్ రెడ్డి ,మానస, వాణి, దినేష్, రాధా, స్వాతి,అరుణ సబితా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం
- ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు
- మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

నారాయణపేట, మే 17

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగల మని ఆదివారం ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసా లు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవ డానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హావర్) లో జాతీయ



సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు. జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# బోనస్ డబ్బులు వేస్తారా లేదా స్పష్టం చేయాలి

- సామజిక కార్యకర్త హెచ్. నర్సింహా



మక్తల్, మే 17

తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లు కు క్వింటాలుకు 500 బోనస్ వేస్తాము అని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో అమ్మి 25 రోజులు అయిన కూడా బోనస్ డబ్బులు వేయలేదు అని రైతులు అంటున్నారు సన్న వడ్లకు బోనస్ వేస్తారా లేదా సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు స్పష్టం చేయాలని సామజిక కార్యకర్త హెచ్. నర్సింహా శనివారం ఒక ప్రకటనలో కోరారు. కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారు కావున గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేరు అని చాలా మంది అనుకుంటున్నారని తెలిపారు. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది కావున వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు దిగులు చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది కావున సౌకారుల దగ్గరకు అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు ఇస్తాము అని అంటున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు.రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు. అదేవిధంగా యాసంగి రైతు భరోసా కేవలం రెండు ఎకరాలకు మాత్రమే వేసి మౌనం పాటించడం ఎంత వరకు సమంజసం అని

# వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను





నారాయణపేట, మే 17

వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. ఆదివారం ఆయన దామరగిద్ద మండలంలోని ఆశన్ పల్లి, మద్దూరు మండలంలోని ఖాజీపూర్ , దమ్ గాన్ పూర్ ఐకెపి, పిఎసిఎస్, మెప్మా వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరిలోని తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా వరిని సేకరించాలని ఆయా కేంద్రాల ఇన్చార్జ్లను ఆదేశించారు. సేకరించిన వరిని, ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లులకు వెంటనే తరలించేలా చూడాలని సూచించారు. అంతేకాకుండా ఓపిఎం ఎస్ లో రోజువారీ ట్యాబ్ ఎంట్రీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సైదులు, డీ టి లు తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరు ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై బిజ్జా శ్రీనివాసులు

నారాయణపేట, మే 17




నారాయణపేట జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై బిజ్జా శ్రీనివాసులు మద్దూరు పోలీస్ స్టేషన్ SHO (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మద్దూరు ఎస్సైగా పనిచేసిన విజయ్ కుమార్ నారాయణపేట జిల్లా VR కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై బిజ్జా శ్రీనివాసులు మాట్లాడుతూ... మద్దూరు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి తెలియజేయాలని సూచించారు.గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.మద్దూరు మండల ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేస్తామని ఎస్సై తెలిపారు.

# 20న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్

- మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేత...



మక్తల్, మే 17

ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా మెడికల్ షాప్ ల ఒకరోజు బంద్ పై మక్తల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి ఆదివారం రోజు మక్తల్ లోని ఆయన నివాసంలో వినతి పత్రం అందించారు. ఆన్ లైన్ లో మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల వినియోగంను నివారించాలని, దీంతో సరైన పద్దతి లో వైద్యం అందకపోవడం, నకిలీ బెడద ప్రమాదం ఉందని, ఆన్ లైన్ నుంచి మందుల అమ్మకాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జాతీయస్థాయిలో మెడికల్ షాపుల బంద్ కు సహకరించాలని మంత్రిని కోరినట్టు మక్తల్ పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఉమ్మడి జిల్లా మెడికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఖాజా మొయినుద్దీన్, టౌన్ అసోసియేషన్ సెక్రటరీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

# కోనాయిపల్లి బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం.

- గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్.



దౌల్తాబాద్ మే 17

దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లి గ్రామం గ్రామం లోని బీసీ కాలనీలో ఎంతోకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయ న తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో బీసీ కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర వుతున్న నేపథ్యంలో ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా కాలనీ అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడమే తమ లక్ష్యమని సర్పంచ్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ గ్రామంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో

# చదువుతో పాటు ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందాలి:జిల్లా కలెక్టర్ కె. హైమావతి.




**సిద్దిపేట మే 17**
విద్యార్థులకు చదువుతో పాటు ధైర్యంగా నిలబడే గుణం, మానసిక శారీరక సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు, మంచి విలువలు పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద ప్రతి వారం ప్రత్యేక థీమ్తో కార్యక్రమాలు నిర్వహిస్తూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ వారం విద్యా వారోత్సవాల భాగంగా విద్య విజయోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షల్లో కాపీయింగ్కు తావులేకుండా నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాల విద్యే బలమైన పునాది అని, చదువుతో పాటు ధైర్యం, కొత్త నైపుణ్యాలు, మానసిక స్థైర్యం, శారీరక దృఢత్వం వంటి అంశాలను కూడా పాఠశాలల్లో నేర్పించాలని చెప్పారు.పదో తరగతిలో జిల్లాకు 97 శాతం ఫలితాలు రావడం వెనుక విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అభినందించారు. ఇంటర్లో విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకొని ఉన్నత లక్ష్యాల వైపు సాగాలని సూచించారు.చదువుతో పాటు ఆటలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహార పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు చెప్పారు.అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల చెక్కులు, క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే యువత క్రీడల ప్రోత్సాహానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.



కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఒడిస్సా ప్రజల మన్ననలు పొందడం పట్ల నాకు ఎంతో గర్వంగా ఉంది

- **దేశవ్యాప్తంగా తమ కళాబృందం ద్వారా ఎన్నో ప్రదేశం ఇస్తూనే ఉన్నాము**
- **ఎక్కడ వెళ్లిన మక్తల్ పేరు ప్రతిష్టలు నిలబెట్టడమే లక్ష్యంగా తమ బృందం ముందడుగు వేస్తుంది**
- **ఆద్య నృత్యాలయ నిర్వాహకులు హారతి జోషి సంతోషం వ్యక్తం**

**మక్తల్, మే 17**
ఒడిస్సా ప్రజల మన్ననలు పొందడం నాకు ఎంతో గర్వంగా ఉందని ఆద్య నృత్యాలయ నిర్వాహకులు హారతి జోషి సంతోషం వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్రం పూరి లో సంస్కృతి భవన్ లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జై జగన్నాథ్ జగన్నాధ సంగీత నృత్య మహోత్సవం సందర్భంగా ఆదివారం నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన ఆధ్యనృత్యాలయ భరత నాట్య అకాడమీ తరుపున గురువు హారతి జ్యోషి శిష్య బృందం అద్భుతమైన భరతనాట్య నృత్యంను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను నిర్వాహకులు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. నృత్య ప్రదర్శన చేసిన వారిలో విద్యార్థులు సాయి సప్తశ్రీ, మేదిని, ఆధ్య,ప్రిశ ,బృంద, హాసిని,ఆధ్య గౌడ్ ఉన్నారు.




**ఈ సందర్భంగా హారతి జ్యోషి 'మన ప్రజా అక్షరంతో ' మాట్లాడుతూ....**

తమ నృత్యాలయ చిన్నారుల పట్టుదల కృషి వల్ల ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాలలో నృత్య ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి చోట ప్రత్యేక ప్రశంసలు పొందడం మరువలేని జ్ఞాపకంగా మిగిలిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇంకా అద్భుతమైన నృత్య ప్రదర్శన ద్వారా మక్తల్ పేరు ప్రతిష్ఠలను దేశం నలుమూలల వ్యాప్తి చేయడమే తన లక్ష్యమని హారతి జోషి పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో తల్లిదండ్రులు పసుల రంజిత్ రెడ్డి ,మానస, వాణి, దినేష్, రాధా, స్వాతి,అరుణ సబితా తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై తనిఖీల్లో భారీగా కేసులు నమోదు

**మల్కాజ్గిరి, మే 17**
వీకెండ్ వచ్చిందంటే చాలు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదికి తెచ్చుకునే కేటుగాళ్లపై మల్కాజ్గిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శని, ఆదివారాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. పట్టుబడిన వారందరిపై పోలీసులు కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. వీరిని త్వరలోనే గౌరవ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

**ద్విచక్ర వాహనదారులే ఎక్కువ..!**

ఈ వీకెండ్ తనిఖీల్లో పట్టుబడిన మొత్తం వాహనాల వివరాలను పోలీసులు వెల్లడించారు. ఇందులో ఎప్పటిలాగే టూ వీలర్స్ సంఖ్యే అత్యధికంగా ఉంది.

**వాహనాల వారీగా నమోదైన కేసులు:**

ద్విచక్ర వాహనాలు : 267 , ఆటోలు: 22, కార్లు/నలుగు చక్రాల వాహనాలు: 33 భారీ వాహనాలు: 01 మోతాదుకు మించి మత్తు..రక్తంలో ఆల్కహాల్ శాతం (బి ఏ సి) ఆధారంగా నిందితులను పోలీసులు వర్గీకరించారు. కొందరైతే ప్రమాదకర స్థాయిని దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడటం గమనార్హం.36 ఎం జి నుంచి 200 ఎం జి లోపు: 297 మంది , 201 ఎం జి నుంచి 300 ఎం జి లోపు: 22 మంది, 301 ఎం జి నుంచి 550 ఎం జి (అత్యంత ప్రమాదకరం): 04 గురు జైలు శిక్ష తప్పదు: డీసీపీ హెచ్చరిక మద్యం మత్తులో వాహనాలు నడపడం క్షమించరాని నేరమని మల్కాజ్గిరి డీసీపీ స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే.. వారిపై భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) 2023 లోని సెక్షన్ 105 (హత్య కానేరని నేరపూరిత నరహత్య) కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానా కూడా పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.గత వారం తీర్పులు: 14 మందికి జైలు శిక్ష గడిచిన వారంలో (మే 10 నుంచి మే 16 వరకు) డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో మొత్తం 194 కేసుల విచారణ పూర్తయింది. కోర్టులు నిందితులకు కింది విధంగా శిక్షలు ఖరారు చేశాయి: జైలు శిక్ష + జరిమానా: 14 మందికి సామాజిక సేవ + జరిమానా: 03 గురికి కేవలం జరిమానా: 177 మందికి సమాజ రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహనదారులు పోలీసులకు

## తిర్మలాపూర్లో సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ.



**దౌల్తాబాద్ మే 17**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ్ రెడ్డి ఆదేశాల మేరకు దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం బాలరాజుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును తాజా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సర్వగారి యాదవ్ రెడ్డి, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న గడ్డం బాలరాజుకు తెలంగాణ ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిందన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ గౌడ్, దౌల్తాబాద్ మండల వికలాంగుల అధ్యక్షుడు నర్సింలు, లక్ష్మీనారాయణ, గడ్డం స్వామి, రాజు, కరుణాకర్, బగ్గీ సురేష్, నల్క నర్సింలు, నీరుడి స్వామి, పెద్దలు వెంకటయ్య, మహిపాల్ రెడ్డి, తలారి బాలయ్య, శివంది కరుణాకర్, బిక్షపతి, కిష్టయ్య, నాగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నిన్నటి జ్ఞాపకాలు - నేటి కలయికలు**



**బచ్చన్నపేట మే 17**
బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో హైస్కూల్లో 2010-2011 టెన్త్ బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహిం చారు.16 సంవత్సరాల తర్వాత కలుసు కున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనం గాసన్మానించారు.పలువురు గురువులు మాట్లాడుతూ మా వద్ద విద్యను అభ్యసించి వివిధ హోదాలలో, వ్యాపార సంస్థలలో ఉంటూ ఒక అమూల్యమైన రోజుగా ఈ అపూర్వ విద్యార్థుల కలయిక సమ్మేళనం అనేది మా జీవితంలో మరిచిపోని రోజు అని వారు తెలిపారు. తదుపరి పాత రోజుల్లో విద్యార్థులతో ఉన్న తీరును వారు గుర్తు తెచ్చుకొని, తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తదుపరి పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము నేర్చుకున్న ఈ పాఠశాల మాకు ఒక మంచి మార్గదర్శకం అయిందని, మా గురువులు యొక్క విద్య ద్వారా, ఆశీస్సుల ద్వారా మా జీవితాన్ని సుఖవంతంగా ఉండేటట్లు జరగడం మా పూర్వజన్మ సుకృతం అని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co